సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 14 । జూలై । 2023



ఆక్రమణలకు విముక్తి

దేవదాయ శాఖ భూముల ఆక్రమణలకు విముక్తి కలగనుంది. ఆర్డినెన్స్ జారీ అయ్యింది.

-IIలో



దాతలే దారి చూపాలి

ఓ కలాసీ లివర్ క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడు. సాయం కోరుతున్నారు.

-IIలో

150 గ్రామాల్లో సర్వే పూర్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెండో విడత రీ సర్వే పనుల్లో జిల్లాలో 230కు గాను 150 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని కలెక్టర్ శ్రీకేశ్ బి.లాఠకర్ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలిపారు. స్టోన్ ప్లాంటేషన్ నిధులు విడుదల చేయాలని కమిషనర్ సిద్ధార్థ్ జైన్‌ను కోరారు. మిగతా గ్రామాల్లోనూ సర్వే పూర్తి చేస్తామన్నారు.

న్యూస్‌రీల్

'మత్తు పదార్థాల రవాణాపై నిఘా పెంచాలి'



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

పొందూరు: గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాపై నిఘా పెంచాలని ఎస్పీ జీఆర్ రాధిక ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావును ఆదేశించారు. ఆమె గురువారం పొందూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పొందూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు, వినియోగం ఎస్పీ దృష్టికి రావడంతో తీవ్రంగా స్పందించారు. గంజాయి వాడుతున్న వారిని, విక్రయదారులను ఉపేక్షించవద్దని సూచించారు. వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గంజాయి వినియోగదారుల్లో విద్యార్థులు ఉంటే కేసులు పెట్టవద్దని, తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. విద్యార్థులను గుర్తిస్తే పునరావాస కేంద్రాలకు పంపిస్తామని హెచ్చరికలు జారీ చేయాలని తెలిపారు. కళాశాలలు, పాఠశాలల వద్ద ఆకతాయిల అల్లర్లను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు.

నేటి నుంచి ఏపీ ఈసెట్ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈసెట్ -2023 ప్రవేశాల కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం ఇన్‌చార్జి గురుగుబెల్లి దామోదరరావు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో వివరాలు వెల్లడించారు. ఈ సెట్‌లో పాలిటెక్నిక్ డిప్లమా పూర్తిచేసిన, బీఎస్సీ మ్యాథ్స్ కాంబినేషన్‌తో పూర్తిచేసిన విద్యార్థులకు ఇంజినీరింగ్ రెండో ఏడాదిలో ప్రవేశాలు లభిస్తాయని అన్నారు. అర్హత గల ర్యాంకు సాధించిన విద్యార్థులు ఈ నెల 14 నుంచి 17 మధ్య కౌన్సెలింగ్ ప్రాసెసింగ్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని, 17 నుంచి 20 వరకు ఆన్‌లైన్ వెరిఫికేషన్ కోసం అప్‌లోడ్ చేయాలని, 19 నుంచి 21 మధ్య వెబ్ ఆప్షన్లు నమోదు చేయాలని, 22న ఆప్షన్లు మార్పునకు అవకాశం ఉందని అన్నారు. 25న సీట్లు అలాట్‌మెంట్ ప్రకటన, 25 నుంచి 30 మధ్య కళాశాలకు సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తిచేయటం పూర్తిచేయాలని తెలిపారు. ఆగస్టు 1 నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభమవుతుందని అన్నారు. ప్రత్యేక కేటగిరీ విద్యా ర్థులకు విజయవాడలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలన ఉంటుందని తెలిపారు. సందేహాలు, సమస్యలు ఉంటే కళాశాల సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు నోటిఫికేషన్ మేరకు ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు.

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ.4.96 లక్షలు



నీలమణి దుర్గ ఆలయంలో హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి హుండీ కానుకల ద్వారా రూ.4,96,638 ఆదాయం లభించిందని ఆలయ ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావులు తెలిపారు. 28 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ హుండీని గురువారం ఉదయంలెక్కించామని తెలిపారు. అలాగే తలనీలాల బహిరంగ వేలం పాట గురువారం సాయంత్రం నిర్వహించగా రూ.17,500లకు పాట ఖరారైందని పేర్కొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశానికి రెండో విడత కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో మిగులు సీట్ల ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్ రావు తెలిపారు. ఈ మేరకు వివరాలను ఎచ్చెర్ల ఐటీఐలో గురువారం తెలియ జేశారు. ఐటీఐ ప్రవేశాల మొదటి కౌన్సెలింగ్ జూన్ నెల 14 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌కు 2020 మంది దరఖాస్తు చేసుకోగా, 503 మంది ప్రవేశాలు పొందారు. జిల్లాలోని 23 ఐటీఐల్లో 3676 సీట్లకు 503 ప్రవేశాలు జరగ్గా 3173 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రెండో కౌన్సెలింగ్‌కు ఈ నెల 31వ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలకు వెళ్లి ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

డ్రోన్ నంబర్ 1008 మిస్సింగ్

- సర్వే చేస్తుండగా ఒక్కసారిగా క్యూ-బేస్ మోడెమ్‌కు అందని భూ సర్వే డ్రోన్ సిగ్నల్స్
- బెండి కొండ పరిసరాల్లో గాలిస్తున్న రెవెన్యూ, సర్వే శాఖ సిబ్బంది



డ్రోన్ నంబర్	1008
ఆపరేటింగ్ సిస్టమ్	ట్రినిటీ ఎఫ్ 90+
విలువ	రూ.28 లక్షలు
అదృశ్యమైన స్థలం	బెండికొండ రిజర్వ్ ఫారెస్టు

వజ్రపుకొత్తూరు: జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్షలో భాగంగా జరుగుతున్న సమగ్ర భూ సర్వేలో ఓ డ్రోన్ అదృశ్యమైంది. వజ్రపుకొత్తూరు మండలం బెండి పంచాయతీ పరిధిలో ఈ నెల 12న పైలెట్ ఉర్జాన రామారావు సర్వేలో భాగంగా బెండి కొండకు సమీపంలో డ్రోన్‌ను ఎగుర వేశారు. డ్రోన్ చాలా ప్రాంతాలను ఫోటోలు తీస్తూ క్యూ-బేస్ మోడెమ్‌కు సమాచారం పంపింది. మొత్తం 84 వే పాయింట్స్‌కు గాను 74 వే పాయింట్స్‌ను పూర్తి చేసుకుని 75వ వే పాయింట్ వద్దకు చేరుకునే సరికి డ్రోన్ అదృశ్యమైపోయింది. మధ్యాహ్నం 1.37 గంటల సమయంలో క్యూ-బేస్ మోడెమ్‌కు సిగ్నల్స్ అందకపోవడంతో సర్వే సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. సుమారు రూ.28 లక్షలు విలువ చేసే డ్రోన్ నంబర్ 1008 ట్రినిటీ ఎఫ్-90+ ఆపరేటింగ్ సిస్టమ్‌తో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. దీంతో ఎక్కడ అదృశ్యమైందో ఆ స్థలాన్ని గుర్తించి పలాస డీఐఓ, వజ్రపుకొత్తూరు తహసీల్దార్ బి.అప్పలస్వామి, వజ్రపుకొత్తూరు, నందిగాం సర్వేయర్లు కె.జోగారావు, సుభాష్, గ్రామ సర్వేయర్లు బి. మీనాక్షి, వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు కలిసి పరిశీలించారు. ఆచూకీ లభించక పోవడంతో బెండి కొండ ప్రాంతాన్ని 12, 13వ తేదీల్లో ముమ్మరంగా గాలించారు. బెండి కొండ ప్రాంతం రిజర్వ్ ఫారెస్టు కావడంతో డ్రోన్ ఆచూకీ దొరకడం కష్టమవుతోంది.

డ్రోన్ ఎగిరే సమయంలో గద్దలు, ఇతర పక్షి జాతులేమైనా డ్రోన్‌కు ఢీకొని ఉన్నా ఆచూకీ కనుగొనడం కష్టమని తెలుస్తోంది. ఈ విషయమై డ్రోన్ పైలెట్ రామారావు తహసీల్దార్ బి. అప్పలస్వామికి ఫిర్యాదు చేసారు. దీంతో ఆయన విజయవాడలోని సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డుల ట్రినిటీ డ్రోన్ మేనేజర్‌కు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, బెండి పరిసర ప్రాంతాల ప్రజలకు ఎవరికైనా డ్రోన్ కనిపిస్తే వెంటనే వజ్రపుకొత్తూరు తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



మిస్సింగ్ అయిన ప్రాంతంలో డ్రోన్ కోసం గాలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

నిషేధం వారి పాపమైతే.. విషం వీరిపైనా..?

సమస్య ఏర్పడింది టీడీపీ ప్రభుత్వ హయాంలో. తప్పు చేసింది ఆనాటి పాలకులు. కానీ సిరా నిండా విషాన్ని నింపుకున్న ఈనాడు మాత్రం నాటి ప్రభుత్వ ప్రస్తావన లేకుండానే భూ సమస్యలంటూ కథనాన్ని అచ్చేసింది. భావనపాడు, దేవునల్తాడ, మర్రిపాడు గ్రామాల్లో ఇదే తరహా సమస్యలను పరిష్కరించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నౌపడలోనూ అందుకు రంగం సిద్ధం చేస్తూ ఉంటే.. అంతలోనే వింత వాదనను జనంపైకి రుద్దే ప్రయత్నం చేసింది. నౌపడలో భూముల క్రయవిక్రయాలు ఆగిపోయాయంటూ అసలు దొంగలను దాచేసి విషపు రాతలను జనం ఇంటికి పంపించింది.



నౌపడ గ్రామం

- టీడీపీ హయాంలోనే భావనపాడు పోర్టు పేరుతో 5795 ఎకరాల భూమి నిషేధిత ఖాతాలోకి
- క్రయవిక్రయాలు జరగక ఇబ్బంది పడిన భావనపాడు, మర్రిపాడు, దేవునల్తాడ రైతులు
- అమరావతి భూస్కామ్ తరహాలో కొట్టేసేందుకు అప్పట్లో ఎత్తుగడ
- 2022లో రైతులకు విముక్తి కలిగించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- నౌపడలోనూ అదే తరహా సమస్యలు
- అన్నీ పరిష్కరిస్తున్న వైఎస్ జగన్ సర్కారు

ఫ్యాక్ట్ చెక్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: భూకుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన టీడీపీ అమరావతి తరహాలోనే మన జిల్లాలోనూ తన ప్రతాపం చూపించేందుకు విఫలయత్నం చేసింది. 2015 సంవత్సరంలో భావనపాడు పోర్టు పేరుతో వేలాది ఎకరాలు కొట్టేయాలని ప్లాన్ వేసింది. అందులో భాగంగా 2015 ఆగస్టు 28వ తేదీన భావనపాడు పోర్టు భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చి 5798.02 ఎకరాల భూములను నిషేధిత ఖాతాలోకి మళ్లించింది. దీంతో భావనపాడు, మర్రిపాడు, దేవునల్తాడ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూక్రయవిక్రయాలు జరక్క ఇక్కట్లు పడ్డారు. ఆ తర్వాత వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి అసలు విషయాన్ని తెలుసుకుని 2022 అక్టోబర్‌లో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆ భూములకు విముక్తి కలిగించారు.

నౌపడ పంచాయతీ గ్రామ కంఠంలోని 35 ఎకరాల భూమిని కూడా టీడీపీ ప్రభుత్వంలో 2017 జూలైలో నిషేధిత ఖాతాలోకి మళ్లించారు. 418-1లో 2 ఎకరాలు, 418-2లో 33 ఎకరాలు గ్రామకంఠంలో ఉన్నాయి. కానీ వీటిని నిషేధిత ఖాతాలో పెట్టేశారు. భావనపాడు పోర్టుకు కేంద్ర బిందువు నౌపడ కావడం వల్ల ఇక్కడ భూమి రేట్లు విపరీతంగా పెరగడంతో అమ్మకం.. కొనుగోలు జరగకుండా టీడీపీ నేత వ్యూహాత్మకంగా దేవదాయ శాఖ భూముల పర్యవేక్షణ పేరుతో వీటిపై ఆంక్షలు విధించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తూ ఉంది.

కానీ పచ్చ పత్రిక 'ఈనాడు' అంతలోనే రోత పుట్టించే కథనాన్ని వండి వార్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషం చిమ్మింది. నాటి అవినీతి మకిలిని ఇప్పటి ప్రభుత్వానికి అంటించే ప్రయత్నం చేసింది. భూములకు సంబంధించిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రైతులు, పేదల పక్షాన నిలిచిన వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురద జల్లింది.

వాస్తవంగా గత ప్రభుత్వంలో నిషేధిత జాబితాలో పెట్టిన భావనపాడు, మర్రిపాడు, దేవునల్తాడ భూ సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కరించింది. నిషేధిత జాబితాలో నుంచి తొలగించి రైతులకు సర్వహక్కులు కల్పించింది. దీంతో ఆ రైతులు ఆనందంతో ఉన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో నిషేధిత జాబితాలోకి వెళ్లిన నౌపడ గ్రామకంఠం భూముల సమస్యను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో ప్రాంతంలో ఉన్న ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వస్తోంది. ఆ క్రమంలోనే ఇక్కడి సమస్యను కూడా పరిష్కరించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో ఈ ప్రభుత్వంలో ఏదో జరిగిపోయిందన్నట్టుగా ఈనాడు చిత్రీకరించే ప్రయత్నం చేసింది.



సమస్య పరిష్కరిస్తాం



నౌపడ గ్రామంలో గ్రామకంఠం సర్వే నంబర్లపై భూములను దేవదాయ అధికారుల సమక్షంలో సబ్ డివిజన్ చేస్తాం. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.

– చలమయ్య, తహసీల్దార్, సంతబొమ్మాళి.

ఇబ్బందులు పడ్డాం



భావనపాడు పోర్టుతో పేరుతో 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 5798 ఎకరాల రైతుల భూమిని నిషేధిత ఖాతాలో పెట్టింది. చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడ్డాం. భూముల క్రయవిక్రయాలు ఆగిపోయాయి. అప్పటి మంత్రి అచ్చెన్నాయుడుకు రైతులంతా విన్నవించినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విముక్తి కలిగింది.

– బి. మోహన్ రెడ్డి, సర్పంచ్ భావనపాడు.

స్పందనలో ఫిర్యాదు చేశాక..



నౌపడలో నాకు ఇళ్లకు సంబంధించి అన్ని పత్రాలు ఉన్నాయి. దీంతో రుణం కోసం బ్యాంకుకు వెళితే స్థలం నిషేధిత ఖాతాలో ఉందని చెప్పారు. రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. దీంతో స్పందనలో జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశాను. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వమే ఈ భూములను నిషేధిత ఖాతాలో చేర్చిందని అధికారుల ద్వారా తెలిసింది.

– పరపటి మురళీ, నౌపడ

'న్యాయం దృష్టిలో అందరూ ఒక్కటే'



మాట్లాడుతున్న శాశ్వత లోక్‌అదాలత్ జడ్జి సువర్ణరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజ్యాంగం కల్పించిన హక్కులు సక్రమంగా వినియోగించుకోవాలని శ్రీకాకుళం జిల్లా శాశ్వత లోక్‌అదాలత్ న్యాయమూర్తి జ్ఞాన సువర్ణరాజు ఆకాంక్షించారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన లోక్‌అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. న్యాయం దృష్టిలో అంతా సమానమేనని అన్నారు. ప్రజా ప్రయోజన సేవల్లో ఎలాంటి సందేహం ఉన్నా శాశ్వత లోక్‌అదాలత్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. న్యాయపరమైన విజ్ఞానాన్ని అన్ని వర్గాల వారికి అందించేందుకు శాశ్వత లోక్‌అదాలత్‌లు ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రయోజన సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెంకి సురేఖ, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టార్ వాకర్స్ క్లబ్ కోశాధికారి బి.దేవీప్రసాద్‌ను న్యాయమూర్తి సువర్ణరాజు అభినందించారు.

నేడు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్‌కు పిలుపు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్‌కు శుక్రవారం పిలుపు ఇచ్చినట్లు జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అధ్యక్షులు పొన్నాన జయరాం తెలిపారు. ఎచ్చెర్లలో గురువారం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు స్ట్రక్చర్ సక్రమంగా లేదని, అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ అంశంపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. కొన్ని కళాశాలలకు రూ. 28 వేలు బీఎస్సీకి ఫీజు స్ట్రక్చర్ ప్రకటించగా, మరికొన్ని కళాశాలలకు రూ. 15వేలు ప్రకటించారని అన్నారు. కళాశాలల ప్రమాణాలు పరిశీలించి ఫీజు నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

దోపిడీ చేసిన 48 గంటల్లోనే..

- పలాస క్వారీలో చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- దొంగల పట్టివేత
- క్రైమ్ టీమ్‌కు రివార్డు ప్రకటించిన ఎస్పీ రాధిక



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ శ్రీనివాసరావు (వెనుక వరుసలో ఐదుగురు నిందితులు)

కాశీబుగ్గ: పలాస మండలంలోని క్వారీలో దోపిడీకి పాల్పడిన ముఠాను పోలీసులు 48 గంటల్లోనే పట్టుకున్నారు. ఈ కేసుపై గురువారం కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావులు వివరాలు వెల్లడించారు. వారు తెలిపిన వివరాల మేరకు..

పలాస మండలం రాజగోపాలపురం గ్రామం శివారులో కొండపై ఉన్న అమ్మిరెడ్డి క్వారీలో సోమవారం రాత్రి పదిన్నర గంటలకు ఐదుగురు దుండగులు చొరబడి దోపిడీ చేశారు. గతంలో క్వారీలో డ్రైవర్‌గా పనిచేసిన సవర శామ్యూల్ మరో నలుగురితో క్వారీకి చేరుకుని కటింగ్ ప్లేయర్‌తో సీసీ కెమెరా వైర్లను కత్తిరించాడు. వాచ్‌మెన్‌పై ఇద్దరు వ్యక్తులు కూర్చుని టవ్వల్‌తో కట్టేశారు. అనంతరం లోపలకు వెళ్లి బీరువాను సుత్తితో పగలుగొట్టి రూ.లక్షానలభై వేలు దోచుకున్నారు. లోపలకు వెళ్లినది ఇద్దరు, బయట ఉన్నది ఇద్దరు కాగా మరొకరు కాపలా కాశారు. బయట వాచ్‌మెన్ పాకెట్‌లో ఉన్న రూ.పదివేలను సైతం లాగేసుకున్నారు. అయితే సీసీ కెమెరాల వైర్లను కత్తిస్తున్నప్పుడు ఆ దృశ్యాలు కెమెరాలో నిక్షిప్తమైపోయాయి. దీంతో దొంగల ఆచూకీ కనిపెట్టడం సులువైంది. చోరీ చేసిన డబ్బుతో ఒకరు డైలీ కలెక్షన్ అప్పు తీర్చగా.. మరొకరు బారువ బీచ్ రిసార్ట్‌కు వెళ్లి ఎంజాయ్ చేశాడు.



దొంగతనానికి వినియోగించిన వస్తువులు, పట్టుబడిన నగదు

నిందితులు వీరే..

చోరీకి పాల్పడిన వారిలో సవర శ్యామ్యూల్‌తో పాటు సవర రంగారావు, సవర జయరాజు, జలుమూరు వాసు, జలుమూరు సురేష్ ఉన్నారు. వీరిలో సవర శామ్యూల్‌ది ఒడిశా రాష్ట్రం గుసాని బ్లాక్ అరకవడ గ్రామం. సవర రంగారావు, సవర జయరాజులు ఒడిశా గుసాని బ్లాక్ రంప, తరాలా గ్రామాలకు చెందినవారు. అలాగే జలుమూరు వాసు, జలుమూరు సురేష్‌లు మందస మండలం సొండిపూడి గ్రామానికి చెందిన వారు. చోరీ చేసిన డబ్బులు పంచుకోవడానికి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మొగిలిపాడు వద్ద మద్యం సేవించి వారంతా పోలీసులకు పట్టుబడటంతో వారి వద్ద నుంచి నగదు, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావుతో పాటు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను ఎస్పీ రాధిక అభినందించారు. క్రైమ్ టీమ్ గొర్లె శ్యామ్, నీలకంఠం, శంకర్‌లకు రివార్డు ప్రకటించగా డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ శ్రీనివాసరావులు అందించారు.

ఆత్మ బంధువులు



నాలుగేళ్లుగా వారు పల్లె ప్రజలకు ఆత్మ బంధువులయ్యారు. అవసరం అన్న వేళ అండగా నిలిచారు. ఆపద వచ్చిన వేళ ఆదుకున్నారు. సామాన్యుడికి సాయం కావాలన్న ప్రతిసారీ ఇంటికి వచ్చి మరీ సేవ చేశారు. ఊరుఊరునా పేదవారికి కుటుంబ సభ్యుల్లా మారి సంక్షేమాన్ని చేరువ చేశారు. అందుకు ఈ లబ్ధిదారుల మాటలే సాక్షి.

–కోటబొమ్మాళి/ఎల్.ఎన్.పేట/ కంచిలి

కరోనాలో కూతురిలా..



నా పేరు మెండ జయలక్ష్మి. మాది చీపుర్లపాడు సచివాలయం పరిధిలోని ఊడికిలపాడు. కరోనా సమయంలో నా భర్తకు, నాకు వ్యాధి సోకింది. ఆ సమయంలో అంతా భయపడి ఎవరూ మా ఇంటి పరిసరాల్లోకి కూడా రాలేదు. అప్పుడు మా వలంటీర్ నేతింటి శిరీష కన్న కూతురిలా మాకు సేవ చేసింది. వలంటీర్‌కు, ఈ వ్యవస్థ తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



ప్రభుత్వ పథకాలను జనాలకు చేరుస్తున్న వలంటీర్లను పవన్ కల్యాణ్ విమర్శించడం సరికాదు. మహిళలు మాయం కావడానికి వలంటీర్ వ్యవస్థ కారణం అన్న ఆరోపణను అంతా ఖండించారు. ఇలా మాట్లాడడానికి ఎలా మనస్కరించింది. ఈ వ్యాఖ్యలు తక్షణం వెనక్కి తీసుకోవాలి.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ (పోలేరులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో)

రుణపడి ఉంటాను..



నా భర్త కురమయ్య చనిపోయాక నేను దిక్కుతోచని పరిస్థితుల్లో పడిపోయాను. నేనెప్పుడూ బయటకు వెళ్లలేదు. ఇంటి పనులు, కూలి పనులు చేయడం తప్ప ఇంకేమీ తెలీదు. అన్నీ నా భర్తే చూసుకునేవారు. ఆయన చనిపోయాక నాకు ఏం చేయాలో పాలుపోలేదు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడం కూడా నాకు తెలియలేదు. మా వలంటీర్ జి.శ్రీధర్ అలాంటి సమయంలో వచ్చి డెత్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకుంటే.. పింఛన్ వస్తుందని చెప్పాడు. నాకేం చేయాలో తెలీదు.. ఎంత డబ్బులు కావాలన్నా ఇస్తా.. ఆపనేదో నువ్వే చెయ్యి నాయనా.. అని చెప్పేశాను. కానీ రూపాయి ఖర్చు లేకుండా డెత్ సర్టిఫికెట్ నా ఇంటికే తెచ్చి ఇచ్చారు. ప్రతి నెలా మా ఇంటికే నా వితంతు పింఛన్ తెచ్చి ఇస్తున్నారు. వలంటీర్లు ఉండడం వల్ల నాలాంటి చదువులేని వారికి ఎంతో మేలు జరుగుతుంది. మా వలంటీర్‌కు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

– ఇందుబు తవిటమ్మ, తురకపేట, ఎల్.ఎన్.పేట

సకల సదుపాయాలతో జగనన్న లే అవుట్లు



సమావేశంలో మాట్లాడుతున్న పీకే దివాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న కాలనీల్లో సకల వసతులు ఉండాలని, ఎలాంటి సమస్య రాకూడదని హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ పీకే దివాన్ అన్నారు. ఆయన గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో హౌసింగ్ పీడీ నక్క గణపతి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు పైడి భీమవరం, రాగోలు, లింగాలవలస, ఆమదాలవలసలో జగనన్న హౌసింగ్ లే అవుట్లను మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా హౌసింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. సమీక్షలో భాగంగా మండలాల వారీగా వివరాలు తెలుసుకున్నారు. గృహ నిర్మాణం పూర్తయిన వెంటనే ప్రభుత్వం ఉచితంగానే కరెంటు మీటర్ ఇస్తోందని, ఉపయోగించుకోవాలని సూచించారు. ఇండెంట్ పెట్టిన విధంగా నిర్మాణ సామగ్రి అందుతుందా లేదా తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులను ఇళ్ల నిర్మాణం దిశగా ప్రోత్సహించాలని సూచించారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో దేవదాయ శాఖ జేవీఓ



దుర్గాభవానికి జ్ఞాపిక అందజేస్తున్న ట్రస్ట్ బోర్డు సభ్యురాలు అనూరాధ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దేవదాయ శాఖ రీజనల్ కార్యాలయ జ్యూయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ (జేవీఓ) అల్లు వెంకట దుర్గా భవాని గురువారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం పాలకమండలి సభ్యురాలు ద్వారపు అనూరాధ..ఆదిత్యుని జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కృష్ణమాచార్యులు, బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శాప్ హ్యాండ్‌బాల్ అకాడమీలో బాలుర ప్రవేశాల కోసం తెనాలిలోని మినీ స్టేడియంలో ఈ నెల 17న రాష్ట్రస్థాయి ఎంపికలు జరగనున్నాయని డీఎస్‌ఏ చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 14 నుంచి 18 ఏళ్ల వయసు కలిగి, రాష్ట్ర/జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించి/ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు అర్హులని స్పష్టం చేశారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, శారీరక దృఢ సామర్థ్య పత్రం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఐదు పాస్‌ఫొటోలతో ఈనెల 17న ఉదయం 8 గంటలకు తెనాలి మినీ స్టేడియం వద్దకు చేరుకోవాలని, పూర్తి వివరాలకు 7842 829449 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుల తనిఖీ



బోరుభద్ర హైస్కూల్‌లో మెనూ పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు

కోటబొమ్మాళి: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఇండేల లక్ష్మీరెడ్డి, జక్కంపూడి కృష్ణకిరణ్, గంజిమాల దేవి గురువారం కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లో పర్యటించారు. బోరుబద్ర ఉన్నత పాఠశాలలో నిబంధనల ప్రకారం జగనన్న గోరుముద్ద పథకం అమలు కాకపోవడాన్ని గుర్తించారు. 397 గుడ్లు అధికంగా నిల్వ ఉండటాన్ని గుర్తించి హెచ్‌ఎం పి.రామకృష్ణకు షోకాజ్ నోటీస్ జారీచేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో సంతబొమ్మాళి తహశీల్దార్ జె.చలమయ్య, కోటబొమ్మాళి సీఎస్‌డీటీ కె.రాము పాల్గొన్నారు.

చిన్నారుల నేరాలపై లోతైన దర్యాప్తు అవసరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిన్నారుల కేసులను విచారణ చేసేటప్పుడు వారు ఎవరి ప్రోద్బలంతో నేరాల బాట పట్టారో గుర్తించి లోతైన దర్యాప్తు చేపట్టాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. గురువారం శ్రీకాకుళం కోర్టు ఆవరణలో పోలీసులు, జువైనల్ జస్టిస్ చట్టంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలనే, చిన్న వయసులోనే నేరాలను కట్టడి చేస్తే సమాజానికి మేలు చేసేవారమవుతామని చెప్పారు. సమావేశంలో న్యాయవాది అన్నెపు భువనేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,000–00
బంగారం(22సి. 10గ్రా.)	55,000–00
వెండి (కిలో)	79,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 460.00
విజయనగరం	రూ. 464.00
శ్రీకాకుళం	రూ. 464.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹123	₹216	₹ 226

దేవదాయ భూముల ఆక్రమణలకు విముక్తి

- భూముల స్వాధీనంపై ఆర్డినెన్స్ జారీ
- కోర్టుల్లో వివాదాలకు చెక్ పెట్టేలా తక్షణ చర్యలు
- జిల్లాలో ఆక్రమణల్లో ఉన్న 4683 ఎకరాల స్వాధీనానికి ప్రణాళిక



ఇతరుల స్వాధీనంలో ఉన్న లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ భూములివే..

అరసవల్లి:

దేవదాయ శాఖ ఎట్టకేలకు విప్లవాత్మక చర్యలకు నడుం బిగించింది. దేవాలయాల భూములు చేతులు మారి అన్యాక్రాంతం అవుతున్నా.. చట్టంలో కొన్ని లొసుగులను అడ్డం పెట్టుకుని ఏళ్ల తరబడి వాటిని అనుభవిస్తున్నా...గత ప్రభుత్వాలేవీ పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం దేవాలయాల భూములన్నీ తిరిగి ఆలయాలకే చెందేలా..సెంటు భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా చర్యలకు దిగింది. ఏడాదిన్నరగా ఇదే అంశంపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పలు సమీక్షలు నిర్వహించి చివరకు ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేశారు. దీనిని రాష్ట్ర గవర్నర్ కూడా ఆమోదించడంతో ఇప్పుడు అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తాజా నిర్ణయంతో ఆక్రమణల్లో ఉన్న లక్షలాది ఎకరాల ఆలయ భూములు తిరిగి టెంపుల్ ప్రాపర్టీగా కొత్త సర్వే నిబంధనల ప్రకారం నమోదు కానున్నాయి. ఈ చర్యలతో జిల్లాలో సుమారు 4683 ఎకరాల ఆలయాల భూములు తిరిగి దేవదాయశాఖకు చెందేలా అడుగులు పడుతున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 30 మండలాల్లో 799 దేవాలయాలుండగా.. వీటిలో ఆదాయాల స్థాయిని బట్టి 6ఎ స్థాయి ఆలయాలు–5, 6బీ ఆలయాలు–17, 6సీ ఆలయాలు–7, 6డీ ఆలయాలు (మఠాలు)–701ఉన్నాయి. వీటికి చెందినట్లుగా 13089.57 ఎకరాల ఆలయ భూములున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. వీటిలో సర్వీసుదారుల వద్ద 4117.75 ఎకరాలు, ఆలయాల సరిహద్దు పరిసరాల్లో 100.51 ఎకరాలు, లీజుల్లో 4115.35 ఎకరాలుండగా.. వివిధ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి ఆక్రమణల్లో 4683.33 ఎకరాల ఆలయ భూములున్నాయి. తాజా ఆర్డినెన్స్ ప్రకారం ఈ ఆక్రమణల్లో ఉన్న భూములతో పాటు ఎన్నో ఏళ్లుగా లీజు కాలం ముగిసినా వారి ఆధీనంలో ఉన్న భూములు కూడా సక్రమంగా తిరిగి ఆయా ఆలయాలకే చెందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

ఆక్రమణలకు చెక్ పెట్టేలా ఆర్డినెన్స్..

ఆలయాల భూములను నిబంధనల ప్రకారం లీజుకు ఇస్తుంటారు. అయితే ఏళ్ల తరబడి లీజు కాలం ముగిసినా వాటిని విడిచిపెట్టకుండా ఉండేవారి నుంచి భూములను కాపాడుకునేందుకు ఇంతవరకు ఆలయ అధికారులు దేవదాయ శాఖ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేయడం..ఆక్రమణదారుడు కూడా లాయర్ల ద్వారా వారి వాదనలు వినిపించి, తుది తీర్పు వరకు ఆ భూములను వారి స్వాధీనంలోనే ఉంచేవారు. అలా కాలయాపన జరగడంతో జిల్లాలో సుమారు 644 ఎకరాల భూములకు సంబంధించి జిల్లా కోర్టులో 7 కేసులు, హైకోర్టులో 72 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజా ఆర్డినెన్స్‌తో ఇలాంటి ఇబ్బందులు లేకుండా సదరు ఆక్రమణదారునికి కేవలం వారం రోజుల గడువుతో నోటీసు జారీ చేసి, వెంటనే ఆ భూములను స్వాధీనపరుచుకునే అధికారాలు తాజా ఆర్డినెన్స్ ద్వారా లభించినట్లయింది. చట్టాన్ని ఉల్లంఘించిన ఆక్రమణదారులకు ఎనిమిదేళ్లకు పైగా శిక్ష కూడా పడే అవకాశముంది. ఇన్ని దశాబ్దాల తర్వాత చట్టంలో చేసిన ఈ సవరణల ప్రకారం దేవదాయ శాఖ ఆస్తుల పరిరక్షణకు మార్గం సుగమమైంది.

ఆదేశాల ప్రకారం చర్యలు..



ఆలయాల భూముల పరిరక్షణకు ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తెచ్చింది. దీనిపై పూర్తి మార్గదర్శక ఆదేశాలు కమిషనర్ కార్యాలయం నుంచి రావాల్సి ఉంది. దీనివల్ల జిల్లాలో వేలాది ఎకరాల భూములు ఆక్రమణలకు విముక్తి కలగనుంది. వారం వ్యవధితో నోటీసు ఇచ్చి భూములు స్వాధీనం చేసుకోనున్నారు. స్వాధీన ప్రక్రియలో అభ్యంతరాలుంటే ఆక్రమణదారుడే కోర్టులకు వెళ్లి .. అవి తమ భూములని నిరూపించుకోవాల్సి వుంటుంది.

– ఎస్.చంద్రశేఖర్, జిల్లా ఎండోమెంట్ అధికారి

దాతలే దారిచూపాలి!

- లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న కలాసీ కనకారావు
- వైద్యం చేయించే స్థోమత లేక ఇబ్బందులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు



భార్యతో కనకారావు

శ్రీకాకుళం కల్చరల్ : అసలే పేదరికం. దానికి తోడు వెంటాడుతున్న మహమ్మారి వ్యాధి. దీంతో ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నాడు జిల్లా కేంద్రంలోని గూనపాలెంకు చెందిన దేవర కనకారావు. లివర్ క్యాన్సర్‌తో పోరాటం చేస్తూ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాడు. దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. పొందూరు మండలం కుంకాం గ్రామానికి చెందిన కనకారావు 12 ఏళ్ల క్రితం కలాసీ పని కోసం శ్రీకాకుళం వచ్చాడు. ఇక్కడే నెలకు రూ.4వేలు అద్దె చెల్లిస్తూ కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ఈయనకు భార్య లక్ష్మీ, పిల్లలు రాణి, ప్రసాద్ ఉన్నారు. తన రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషించుకుంటువచ్చాడు. కుమార్తెకు వివాహం చేశాడు. కుమారుడిని ఇంటర్మీడియట్ చదివించాడు. రెండునెలలుగా లివర్ క్యాన్సర్‌తో అవస్థలు పడుతున్నాడు. మందులు కొనుక్కునేందుకు కూడా డబ్బులు లేకపోవడం, చికిత్స కోసం ఎక్కువ మొత్తం అవసరం కావడంతో మంచానికే పరిమితమవుతున్నాడు.

ఖర్చు చేసినా..

కనకారావుకు మొదట్లో ఒళ్లునొప్పులు బాధించేవి. ఎందరినో వైద్యులను సంప్రదించినా ప్రయోజనం లేకపోవడంతో సీటీ స్కాన్ చేయించి విశాఖ వద్ద క్యాన్సర్ ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ తనిఖీ చేయగా లివర్ క్యాన్సర్ సోకినట్లు తేలింది. ప్రస్తుతం ఫోర్త్ స్టేజ్‌లో ఉంది. ఆపరేషన్‌కు, కిమో చేసేందుకు వీలులేదని, కేవలం మందులు మాత్రమే వాడాలని వైద్యులు సూచించారు. వారం మందులు కొనుగోలుకు రూ.8వేల వరకు ఖర్చు అవుతోంది. ప్రతి 25 రోజులకు విశాఖ వెళ్లి తనిఖీ చేయించుకుని రూ.10 వేలు విలువైన మందులు కొనుగోలు చేసుకుని వస్తున్నారు. తండ్రి కలాసీ పని ఆగిపోవడంతో కుటుంబాన్ని పోషించేందుకు కుమారుడు ఇంటర్ చదువు మానేశాడు. తప్పనిసరి పరిస్థితుల్లో మార్కెట్‌కు పనికి వెళ్తున్నాడు.

సాయం చేయదలిస్తే..

కనకారావు దీనస్థితికి స్పందించి దాతలు ఆర్థిక సాయం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎవరైనా సాయం చేయాలనుకునేంటే 9177557596 నంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు రాజకీయ సమాధి



మొదలవలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: రానున్న ఎన్నికల్లో ఓటమితో చంద్రబాబునాయుడుకు శాశ్వత రాజకీయ సమాధి ఖాయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరు మండలం మొదలవలసలో జగనన్న సురక్ష పథకంలో భాగంగా లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక లోపంతో పథకం అందకపోతే జగనన్న సురక్షలో గుర్తించి అందజేస్తామని చెప్పారు. జగనన్న బటన్ నొక్కితే సంక్షేమం మీ ఖాతాల్లోకి వస్తుందని, ఆయన కోసం రానున్న ఎన్నికల్లో మీరంతా బటన్ నొక్కి మరోసారి సీఎంను చేయాలని కోరారు. శ్రీరాముడు ధర్మం కోసం పోరాడితే, సైనికుడు దేశం కోసం పోరాడుతుంటే, జగన్ ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్నాడని కొనియాడారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లను పవన్ కల్యాణ్, చంద్రబాబునాయుడు విమర్శిస్తున్నారని, ఇంతకంటే దౌర్భాగ్య పరిస్థితి ఉండదని అన్నారు. అధికారం లేనిదే చంద్రబాబు ఉండలేడని, రానున్న ఎన్నికల్లో ఓటమి ఖాయమని చెప్పారు. కమ్యూనిస్టులు సిద్ధాంతాలను మారుస్తున్నారని దుయ్యబట్టారు. దళితులకు ఇళ్లపట్టాలు ఇస్తుంటే వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. తాడివలస రెల్లిగెడ్డలో టీడీపీ హయాంలో కట్టిన వంతెన కొట్టుకుపోవడంతో విజిలెన్సు విచారణ జరిపించామని, బాధ్యులపై త్వరలోనే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, మండల పార్టీ కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, సర్పంచ్‌లు నవ్య, శ్రీవల్లి, నాయకులు కొంచాడ రమణమూర్తి, బాడాన కృష్ణ, బాడాన సునీల్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ఆర్టీసీ డ్రైవింగ్ బ్యాచ్ ప్రారంభం



విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్(శ్రీకాకుళం)లో ఈ నెల 20 నుంచి 13వ బ్యాచ్ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభమవుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. ఇప్పటివరకు 12 బ్యాచ్‌లు దిగ్విజయంగా పూర్తి చేసుకున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులు వివిధ శాఖలో ఉద్యోగాలు పొందారని, ఆర్టీసీ అద్దె బస్సుల్లోనూ డ్రైవర్లుగా పనిచేస్తున్నారని చెప్పారు. దేశంలో ప్రభుత్వం నడుపుతున్న ఏకైక డ్రైవింగ్ స్కూల్ ఏపీఎస్‌ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ అని పేర్కొన్నారు. డ్రైవింగ్‌తో పాటు యోగా, వ్యక్తిత్వ వికాసం, ట్రాఫిక్ నిబంధనలు, ఫస్ట్ ఎయిడ్, మెకానికల్ వర్క్‌పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 9963091999, 7989723505 నంబర్లను సంప్రదించాలని కోరారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

శ్రీకాకుళం రూరల్: డ్రైవింగ్ లైసెన్సు సస్పెండ్ చేశాక వాహనం నడిపితే మోటారు వాహన చట్టం కింద రూ.10,000 అపరాధ రుసుం వసూలు చేస్తామని, వాహనాన్ని సీజ్ చేస్తామని జిల్లా ఉపరవాణా శాఖాధికారి శివరామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాహన యజమానికి రూ.5వేలు అపరాధ రుసుం, మూడు నెలలు జైలు శిక్ష కుడా విధిస్తామని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాన్ని నడిపితే రూ.10వేలు జరిమానా ఆరు నెలలు జైలు శిక్ష, రెండోసారి పట్టుబడితే రూ.15వేలు జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధిస్తామని తెలిపారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- 2024 వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రజలతో మమేకం
- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రణస్థలం: వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా శ్రమిస్తున్న ప్రతి కార్యకర్త, నాయకులకు అన్ని వేళలా అండగా ఉంటానని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండల కేంద్రంలోని దన్నానపేట కూడలి వద్ద గురువారం ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా షిర్డీసాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా అన్నదానం చేపట్టారు. ఎమ్మెల్యే సతీమణి, మాజీ ఎంపీపీ గొర్లె పరిమళ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. కిరణ్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి క్రికెట్ టోర్నీలో విజేతలుగా నిలిచిన పైడిభీమవరం, లావేరు జట్లకు ట్రోఫీతో పాటు, నగదు అందజేశారు. కిరణ్ యువసేన ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని అనాథ పిల్లలకు భోజనం పెట్టారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలో నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు ద్విచక్ర వాహనాలతో సభా ప్రాంగణానికి తరలివచ్చి అక్కడి నుంచి శ్రీకాకుళం బైపాస్ రోడ్డు వరకు రెండు వేల బైకులతో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభావేదికపై ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతం కష్టపడతానని చెప్పారు. ఎటువంటి లోటుపాట్లు ఉన్నా నేరుగా తనకు తెలియజేయవచ్చని, చాటుమాటు మాటలు, లేనిపోని పుకార్లు మాట్లాడవద్దని హితవుపలికారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తానని, కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు టీడీపీ, జనసేనకు చెందిన నా నాయకుడైనా తనలా ప్రజల్లో తిరిగారా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, రణస్థలం మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ క్లినిక్ నడిపితే చర్యలు

- టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



సేవలపై ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వరిస్తున్న వైద్యులు ప్రైవేట్ క్లినిక్‌లు నడిపితే చర్యలు తీసుకుంటామని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం తనిఖీ చేశారు. ప్రతి విభాగాన్ని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. మందుల నిల్వ కేంద్రంలోని రికార్డుల్లో సరైన వివరాలు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తూ కొంత మంది వైద్య సిబ్బంది బయట ప్రైవేట్ క్లినిక్‌ను నడిపిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. వైద్యం కోసం వచ్చిన వారిని సొంత క్లినిక్‌లకు రిఫర్ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. రాత్రివేళ వైద్యం కోసం వచ్చిన వారికి సిబ్బంది అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యారావు, వైద్యులు కేశవరావు, శ్రీరాములు, మహరాజ్, తేజ్‌ప్రవీణ్, మధు, రాజేష్, సంతోష్, ధనలక్ష్మి, జ్ఞానప్రసూణ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా జ్వరాలపై అప్రమత్తం



చీపిలో అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

మందస: గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ జ్వరాలు విజృంభించకుండా అధికారులు, వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. మందస మండలంలోని గిరిజన ప్రాంతాలైన చీపి పంచాయతీలో గురువారం పర్యటించారు. మూడు మలేరియా కేసులు నమోదు కావడంతో వైద్య సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పూర్ణచంద్రను ఆదేశించారు. ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, ఈఓపీఆర్డీ కె.జయప్రకాశ్‌లతో మాట్లాడుతూ బావుల్లో క్లోరినేషన్ చేయించాలని, సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలన్నారు. ఏఎన్‌ఎంలతో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలని, అవసరమైతే శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం చీపి వద్ద మహేంద్రతనయ నదిపై ప్రమాదకరంగా మారిన చీపిగెడ్డను పరిశీలించారు. మందసలో బస్టాండ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మందసలో ప్రభుత్వ పెట్రోల్‌బంక్ నిర్మాణానికి స్థలపరిశీలన చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీఈ వంగపండు శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.ప్రసన్నకుమార్, మలేరియా నివారణ అధికారి ఎస్ఎన్ పాణిగ్రాహి, పీఎస్ సోమేశ్వరరావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

పాముకాటుకు మహిళ మృతి



దాలమ్మ మృతదేహం

మెళియాపుట్టి: మండలంలోని చీపురుపల్లి గ్రామానికి చెందిన మహిళ పాముకాటుకు గురై గురువారం మృతిచెందింది. నందిగాం దాలమ్మ (57) తన పెరడులో పనులు చేస్తుండగా నాగుపాము కాటు వేసింది. కుటుంబసభ్యులు వెంటనే కరజాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈమెకు భర్త మల్లేసు, ఇద్దరు కుమారులు ఖగేశ్వరరావు, కుబేలు ఉన్నారు. ఇద్దరికీ వివాహాలు జరిగాయి. దాలమ్మ ఆకస్మిక మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

బెంగళూరులో యువ శాస్త్రవేత్త మృతి



కిల్లి సునీల్‌కుమార్(ఫైల్)

మందస: ఆశల దీపం ఆరిపోయింది. ఓ కుగ్రామం నుంచి యువ సైంటిస్ట్‌గా ఎదిగి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడనుకున్న ఆ యువకుడు అర్ధంతరంగా తనువు చాలించడం స్థానికంగా విషాదం నింపింది. మందస మండలం కుంటికోట గ్రామానికి చెందిన కిల్లి లక్ష్మణరావు, వామాక్షి దంపతుల ఏకైక కుమారుడు కిల్లి సునీల్‌కుమార్(33) కోల్‌కత్తాలో బీఫార్మసీలో పీహెచ్‌డీ చేసి బెంగళూరులో మిలాన్ అనే ఆర్గనైజేషన్‌లో జూనియర్ సైంటిస్ట్‌గా ఉద్యోగం సాధించారు. ఏడాది కింద లిఖితను వివాహం చేసుకున్నారు. విధుల్లో భాగంగా గురువారం సంస్థ కార్యాలయానికి నడిచి వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొంది. స్థానికులు స్పందించి ఆస్పత్రిలో చేరి్పంచగా చికిత్స పొందుతూ సునీల్‌కుమార్ మృతిచెందారు. దీంతో కుంటికోటలో విషాదఛాయలు అలముకున్నాయి. సర్పంచ్ దుంపల వైకుంఠరావు సునీల్‌కుమార్ కుటుంబసభ్యులను ఓదార్చి సంతాపం తెలిపారు.

ఫలక్‌నుమా రైలులో యువకుడు మృతి



యువకుడి మృతదేహం

కాశీబుగ్గ: ఫలక్‌నుమా రైలులో యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్తున్న సూపర్‌ఫాస్ట్ రైలు(12704)లో పలాస వచ్చేసరికి యువకుడు మృతి చెందినట్లు తోటి ప్రయాణికులు గుర్తించి ఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని జీఆర్‌పీ పోలీసులకు అప్పగించారు. యువకుడి వివరాలు తెలియాల్సి ఉందని జీఆర్‌పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచామని చెప్పారు.

సూపర్‌మార్కెట్లో చోరీ

నరసన్నపేట: మండలంలోని చిక్కాలవలస సమీపంలో జగన్నాథపురం కూడలి వద్ద సూపర్ మార్కెట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గురువారం ఉదయం షాపు తెరిచేసరికి షట్టర్ తాళాలు విరగొట్టి ఉన్నాయని, లోపల సీసీ కెమెరాలు కూడా ధ్వంసం చేసి ఉన్నాయని యజమాని ఎన్ని సంతోష్‌కుమార్ తెలిపారు. ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వచ్చే విద్యుత్‌ను నిలిపి చోరీకి పాల్పడినట్లు చెప్పారు. సొరుగులో ఉన్న రూ.20 వేలు నగదు, లక్ష రూపాయల విలువ కలిగిన సామాన్లు చోరీకి గురైనట్లు వివరించారు. సమాచారం అందుకున్న క్లూస్ టీమ్ వచ్చి షాపును పరిశీలించారు.

దళితులకు ఆత్మగౌరవం పెంచింది జగనన్నే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు రుషి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వెనుకబాటుతనంలో ఉన్న దళితులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించి ఆత్మగౌరవం పెంచింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి అన్నారు. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కు కల్పిస్తూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం హర్షం వ్యక్తం చేస్తూ వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దళితులకు భూయాజమాన్య హక్కు తప్ప భూ బదలాయింపు హక్కు లేదన్నారు. ఇప్పుడు ఆ హక్కును జగనన్న కల్పించి మరోసారి దళితులపై తనకున్న అభిమానాన్ని చాటి చెప్పారన్నారు. దళితుల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో భూయాజమాన్య హక్కు కల్పించడంతో పాటు శ్మశాన వాటికలకు స్థలం కేటాయించడం చరిత్రాత్మకమన్నారు. చంద్రబాబుకు దళితుల ఓట్లు కావాలే తప్ప వారి సంక్షేమం పట్టదన్నారు. దళితులంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటారని స్పష్టం చేశారు. రాష్ట్ర నాటక అకాడమి డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, ఎస్ఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్‌లు మాట్లాడుతూ దశాబ్దాల కలను నిజం చేయడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరక సూర్యనారాయణ, జలగడుగుల శ్రీనివాస్, నల్లపిల్లి భానుప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే

రణస్థలం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన నచ్చి కొచ్చెర్ల పంచాయతీ నుంచి జనసేన చెందిన 10 కుటుంబాలు గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జీరు ఢిల్లీ రెడ్డి, బస్వ నీలయ్య రెడ్డి, జీరు శ్రీనివాస్ రెడ్డి, బస్వ సూరిరెడ్డి, జీరు అప్పన్న రెడ్డి, గాలిశివారెడ్డి, బస్వ గౌరి రెడ్డి, బస్వ గోవిందరెడ్డి, బుచ్చ అదియ్య రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బస్వ దురుగుబాబు, కొచ్చెర్ల వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన డాక్టర్ వరుణ్



విజయసాయిరెడ్డికి జిల్లా పరిస్థితులను వివరిస్తున్న చింతాడ వరుణ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డిని పార్టీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చింతాడ వరుణ్ గురువారం అమరావతి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పరిస్థితులను వివరించారు. జిల్లా వ్యాప్తంగా డాక్టర్స్ సెల్ విభాగాన్ని బలోపేతం చేసి 2024 ఎన్నికల్లో కీలకపాత్ర పోషించాలని విజయసాయి రెడ్డి సూచించారు.

తాళాలు అప్పగించిన కార్పెంటర్

శ్రీకాకుళం : శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలోని ఆర్ఎంవో కార్యాలయం, క్వార్టర్స్ తాళాలను కార్పెంటర్ రమణ సూపరింటెండెంట్ డాక్టర్ స్వామినాయుడుకు అప్పగించారు. రిమ్స్‌లో తాళాలు వివాదం పేరిట కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో రమణను సూపరింటెండెంట్ ప్రశ్నించగా.. తాళాలు ఎవరికి అప్పగించాలో తెలియక తన వద్ద ఉంచుకున్నానని చెప్పి వాటిని అప్పగించడంతో వివాదం సద్దుమణిగింది.

కృష్ణా వర్సిటీ వీసీగా జ్ఞానమణి



జ్ఞానమణి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మొదటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జ్ఞానమణి మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా నియమితులయ్యారు. 2008 ఆగస్టు 28 నుంచి 2009 ఆగస్టు 26 వరకు ఆయన రిజిస్ట్రార్‌గా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్వీ సుధాకర్ హయాంలో పనిచేశారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం జువాలజీ విశ్రాంత ప్రొఫెసర్ అయిన జ్ఞానమణిని వీసీగా ఉన్నత విద్యాశాఖ నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేయడం పట్ల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ప్రజల చెంతకే వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ హరితాశ్రీ

జి.సిగడాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తున్నారని వైద్యాధికారి పొన్నాడ హరితాశ్రీ అన్నారు. గురువారం చీడిపేటలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సంధ్యారాణి, హెచ్‌వీ రమాదేవి, ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: శతశాతం సమస్యల పరిష్కారం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఇబ్రహీంబాద్‌లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు సపపల నారాయణరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు మురళీధర్‌బాబా, ఎంపీటీసీ సూర వెంకటరమణ, నాయకులు సూర అప్పారావు, సీపాన ఎర్రన్నాయుడు, కిల్లి రఘురాం పాల్గొన్నారు.

వలంటీర్లకు సలాం

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ, నిస్వార్థంగా సేవలందిస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల మంజూరులో కీలక పాత్ర పోషిస్తున్న వారిపై నిందలు తగవంటూ అన్ని వర్గాల వారు మండిపడుతున్నారు. కరోనా వంటి కష్టకాలంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన వైనాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్/లావేరు/గార/రణస్థలం

వలంటీర్ వల్లే చేయూత..



వైఎస్సార్ చేయూత పథకం వల్ల రూ.18,750 వస్తుందనే విషయం నాకు తెలియదు. వలంటీర్ శ్రావణి ఇంటికి వచ్చి ఆధార్ కార్డు, బ్యాంకు వివరాలు తీసుకుని చేయూత పథకానికి అప్లయ్ చేసింది. డబ్బులు పడిన తరువాత సీఎం జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నీ ఖాతాలో రూ.18,750 జమ చేశారని చెప్పడం ఎంతో సంతోషమేసింది. ఇలాంటి వలంటీర్లు ఉండటం వల్ల మాకు తెలియని పథకాలు కూడా ఇంటికే వస్తున్నాయి.

– బోనెల పార్వతి, కొండములగాం, రణస్థలం మండలం

రంఛన్‌గా పింఛన్..



గతంలో పింఛన్ డబ్బులు కోసం పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పడిగాపులు కాసేవాడిని. ఇప్పుడు పంచాయతీ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం రాకుండా వలంటీర్ ఈశ్వరమ్మ ప్రతి నెలా 1వ తేదీన మా ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు అందజేస్తున్నాడు. పింఛన్ డబ్బులు ఇవ్వడమే కాదు నాకు ప్రభుత్వ పనులు ఏవి ఉన్నా వలంటీరే చేస్తున్నారు. వలంటీరు బాగా సేవలు అందిస్తున్నారు.

– లంకలపల్లి నీలారావు, వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారుడు, లావేటిపాలేం

అద్దె బతుకులకు అండగా....

అంపోలు గ్రామ సమీపంలో పరిశ్రమలో పనిచేసేందుకు 23 ఏళ్ల కిందట వచ్చాం. అది మొదలుపద్దాక ఇక్కడే అద్దె ఇంటిలోనే ఉంటున్నాం. జగన్‌బాబు ప్రభుత్వం రావడం, వలంటీరు మా ఇంటికి వచ్చి వివరాలు అడిగారు. రూ.5 లక్షల విలువైన సెంటున్నర స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.లక్షా 80వేలు, ఆటో నడుపుతున్న నా భర్తకు వాహనమిత్ర కింద నాలుగేళ్లుగా రూ.40 వేలు, ఇద్దరు కొడుకులకు ప్రస్తుతం వసతిదీవెన, రెండేళ్ల కిందట వరకు అమ్మ ఒడి, నాకు ఆసరా కింద నిధులు వచ్చాయి. ఇప్పటివరకు రూ. 8లక్షలు ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందాను. పైసా లంచం తీసుకోకుండా వలంటీరు గొండు అనిల్‌బాబు మా ఇంటికి వచ్చి కాగితాలు మాత్రమే తీసుకెళ్లి డబ్బులు వచ్చేలా చేస్తున్నాడు. ఇది జగనన్న ప్రభుత్వం, వలంటీరు వల్లే సాధ్యమైంది.



– మాసాభక్తుల కృష్ణవేణి, అంపోలు, గార మండలం

వేలిముద్ర పడకపోయినా..

నేను అనారోగ్యంతో బాధపడుతున్నాను. లేవలేని పరిస్థితి. కొన్ని నెలలుగా మంచానికి పరిమితమయ్యాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంజూరు చేసిన పింఛన్‌ను గ్రామ వలంటీర్ మధు ప్రతి నెలా ఇంటికి వచ్చి అందజేస్తున్నాడు. కొన్ని సార్లు వేలి ముద్రపడకపోయినా మళ్లీ ప్రయత్నించి దేవుడిలా ఆదుకుంటున్నాడు. ఇటువంటి వలంటీర్లపై తప్పుడు ప్రచారం దురదృష్టకరం.



– అలికాన ఎర్రమ్మ, కుశాలపురం, ఎచ్చెర్ల మండలం

అరసవల్లిలో అధునాతన పార్కు

- 2.77 ఎకరాల రెవెన్యూ భూమి నగర పాలక సంస్థకు బదలాయింపు
- క్యాబినెట్ ఆమోదం



పార్కుగా రూపుదిద్దుకోనున్న స్థలం

శ్రీకాకుళం : శ్రీకాకుళం నగర పరిధిలోని అరసవిల్లిలో అతి త్వరలోనే సుందరమైన పార్కు రూపుదిద్దుకునేందుకు అవకాశం ఏర్పడింది. సూర్యనారాయణ స్వామి దేవాలయం సమీపంలో 2.77 ఎకరాల రెవన్యూ భూమి ఉంది. దానిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నించగా రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆ స్థలాన్ని నగర పాలక సంస్థకు బదలాయింపు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో స్థలం బదలాయింపునకు ఆమోదం లభించింది. ఈ స్థలంలో పార్కుతో పాటు నగర పాలక సంస్థకు ఆదాయం సమకూరేలా కొన్ని భవనాలు నిర్మించేందుకు అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. అరసవిల్లికి వచ్చే భక్తులకు ఉపయోగకరంగా ఉండేలా ఈ స్థలాన్ని వినియోగించుకోవాలని కార్పొరేషన్ అధికారులు భావిస్తున్నారు. క్యాబినెట్ ఆమోదానికి సంబంధించి ఉత్తర్వులు అధికారులకు అందగానే మంత్రి ధర్మాన, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని చేపట్టబోయే పనులకు సంబంధించి అంచనాలు రూపొందిస్తారు. పార్కు, షాపింగ్ కాంప్లెక్సు, ఫంక్షన్ హాల్, రెస్టారెంటు వంటివి నిర్మించే అవకాశాలున్నాయి. ఏది ఏమైనా ఈ స్థలంలో నిర్మాణాలు జరిగితే విలువైన ఆస్తి అన్యాక్రాంతం కాకుండా ఉండటంతో పాటు నగర పాలకసంస్థకు ఆదాయం, భక్తులకు సౌకర్యం అందుబాటులోకి వచ్చేందుకు వీలుకలుగుతుంది.

ఉత్తర్వులు రాగానే అంచనాలు..



క్యాబినెట్ ఆమోదం ఉత్తర్వులు అందగానే అంచనాలు రూపొందిస్తాం. ప్రధానంగా పార్కును నిర్మించాలనే ఆలోచనతో ఉన్నాం. ఆహ్లాదకరంగా ఉండేలా దీనిని మలుచుతాం. పార్కుతో పాటు భక్తులకు ఉపయోగకరంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ మంత్రి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయం చేస్తాం.

– చల్లా ఓబులేషు, నగరపాలక కమిషనర్

జగనన్న సురక్షతో శతశాతం లబ్ధి



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

గార: అర్హత ఉండి ఏ ఒక్కరూ పథకాలకు దూరం కాకూడదన్న ఉద్దేశం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. గురువారం అంపోలు–3 (లింగాలవలస) సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 98 శాతం ఎన్నికల హామీలు నెరవేర్చి చేతల ప్రభుత్వమని వైఎస్ జగన్‌మోహనరెడ్డి నిరూపించారని చెప్పారు. అవినీతికి అస్కారం లేకుండా పారదర్శకంగా పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు గొండు కృష్ణమూర్తి, తహశీల్దార్ జెన్ని రామారావు, సర్పంచ్ గొండు జయరాం, పీస శ్రీహరిరావు, పీస గోపి, ఎంపీటీసీలు ముద్దాడ గోవిందరావు, పొదిలాపు రామజోగి పాల్గొన్నారు.

మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా సూర్యచంద్రరావు



డాక్టర్ కె.సూర్యచంద్రను అభినందిస్తున్న డాక్టర్ శ్రీరాములు, అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు నియమితులయ్యారు. గురువారం ఈయన బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ బదిలీల నేపథ్యంలో ప్రిన్సిపాళ్లు, లెక్చరర్ల బదిలీలు చేపట్టారు. ఇందులో భాగంగా పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సూర్యచంద్రరావు శ్రీకాకుళం మహిళా కళాశాలకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలు అందించిన డాక్టర్ కణితి శ్రీరాములు పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా నాక్ గుర్తింపు, స్వయంప్రతిపత్తి కళాశాలగా తీసుకురావడంతో ఈయన కీలక భూమిక పోషించారు. అనేక అభివృద్ధి పనులు చేశారు. కాగా, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాములు నుంచి డాక్టర్ సూర్యచంద్ర గురువారం చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ అటానమస్ కాలేజీకు ప్రిన్సిపాల్‌గా పనిచేసే అవకాశం రావడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం సూర్యచంద్రను బదిలీపై వెళ్తున్న డాక్టర్ కె.శ్రీరాములు, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతి ఫ్రెడరిక్, గవర్నమెంట్ కాలేజెస్ టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ కె.చంద్రపతిరావు, డాక్టర్ పైడితల్లి, రామకృష్ణ, పోలినాయుడు, డాక్టర్ శశి భూషణ్, చిన్నారావు, మహిళా కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

ఆదిత్యాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల కోసం నగరానికి చెందిన దేవి గ్లాస్ కాన్సెప్ట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కుదిరేళ్ల అప్పారావు, పార్వతిదేవి దంపతులు గురువారం రూ.లక్ష విరాళాన్ని ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తదాతల సహాయంతో ఆలయ పరిసరాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. దాతలకు పర్వదినాల్లో విశిష్ట దర్శన డోనర్ పాసులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యురాలు ద్వారపు అనూరాధా అజిత్‌కుమార్ దంపతులు, అధికార సిబ్బంది కృష్ణమాచార్యులు, చక్రవర్తి పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఉప సర్పంచ్ ఎన్నిక



అప్పమ్మకు పత్రాన్ని అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి

లావేరు: మురపాక పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. ఇంతవరకూ ఉన్న వ్యక్తి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరిగింది. 1వ వార్డు మెంబరు కోరాడ అప్పమ్మను ఉప సర్పంచ్‌గా ప్రతిపాదించగా మిగతా మెంబర్లు మద్దతు పలికారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.విశ్వేశ్వరరావు ధ్రువపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, సర్పంచ్ పెయ్యల నాగమణి, పంచాయతీ కార్యదర్శి కె.వి.ప్రసాద్, సచివాలయ కన్వీనర్ బాలి శ్రీనివాస నాయుడు, నాయకులు పెయ్యల లక్ష్మణరావు, వడ్డి అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

లావేరు: వ్యాధులను నిర్లక్ష్యం చేయరాదని మురపాక పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ ఆర్.శ్యామ్‌సుందర్ అన్నారు. మండలంలోని బుడుమూరులో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్, వైద్య సిబ్బంది శిబిరానికి వచ్చిన వారికి ఉచితంగా వైద్య తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరికైనా అనారోగ్య సమస్యలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి పలువురి ఎంపిక

శ్రీకాకుళం: ప్రభుత్వం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ప్రవేశ ఫలితాల్లో శ్రీకాకుళం వరం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 2022–23 విద్యా సంవత్సరంలో పాఠశాలలో పదో తరగతి చదివిన జల్లేపల్లి సాయి గౌతమ్ నూజివీడుకు, బడ ద రాహుల్, ఊన్న భరత్ సాయి, బరాటం వాగ్దేవి, పాలుమూరు సుధాగాయిత్రి శ్రీకాకుళంకు, పుట్టా కారుణ్య ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్ఎం పి.ఇందిరామణి గురువారం తెలిపారు. వీరిని పాఠశాల వ్యవస్థాపకులు అంధవరపు ప్రసాద్, సంతోష్, పాఠశాల కమిటీ సభ్యులు మళ్లా శ్రీనివాస చక్రవర్తి, మళ్లా కళ్యాణ చక్రవర్తి, కిల్లంశెట్టి అరుణ్‌కుమార్ గుప్తా, కడపల కృష్ణవేణి తదితరులు అభినందించారు.

జి.సిగడాం: స్థానిక మోడల్ పాఠశాలలో 10 వతరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లంక గురువారం తెలిపారు. పొగిరి ఇందుమతి (నూజివీడు), కాలెపు మోక్షశ్రీ(శ్రీకాకుళం), కంచు దేవి(శ్రీకాకుళం), అలజింగి రమ్య వసంతకుమారి(ఒంగోలు) సీట్లు దక్కించుకున్నారని పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : తమ కుమార్తె కనిపించడం లేదంటూ ఓ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని బాదుర్లపేట యాతవీధికి చెందిన యువతికి గత ఏడాది ఆగస్టులో నరసన్నపేటకు చెందిన యువకుడితో వివాహం జరిపించారు. ఆషాఢ మాసం సందర్భంగా జూన్ 14న అత్తవారింటి నుంచి పుట్టింటికి వచ్చింది. ఈ నెల 12న సాయంత్రం 5:30 గంటలకు బహిర్భూమికని వెళ్లిన కుమార్తె తిరిగి రాకపోవడంతో అత్తింటి వారికి ఫోన్ చేసి చెప్పారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో గురువారం పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి

లావేరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి కోరారు. పెదలింగాలవలస సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లుకలాపు యశోద, మండల పంచాయతీ అధికారి వి.విశ్వేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ జి.రత్నకుమార్, పంచాయతీ కార్యదర్శి ఎం.రమణ, వీఆర్ఓ కిరణ్మయి, వీఆర్ఏ శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని పున్నాం, డీఆర్‌వలస గ్రామ సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి జయకుమారి, మండల ప్రత్యేకాధికారి బి.వి.ప్రసాదరావు, తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎంపీడీఓ నిశ్చల, డీటీ ఎస్.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కోటపాలెంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

రణస్థలం: అర్హులందరికీ జగనన్న సురక్ష పథకం ద్వారా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కోటపాలెం గ్రామ సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 సేవలు సత్వరమే అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సనపల కిరణ్ కుమార్, ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకట రెడ్డి, మహంతి చినరామినాయుడు, కోటపాలెం సర్పంచ్ గొర్లె జగదీష్, ఎంపీటీసీ సుంకరి కిషోర్‌కుమార్, పైడిభీమవరం పీఏసీఎస్ అధ్యక్షుడు తిరుపతి నాయుడు, చౌదరి రాము, జోగ శ్రీనివాసరావు, ఉరిటి రామకోటి, అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

నిరాడంబరుడు చౌదరి సత్యనారాయణ



చౌదరి సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, దివంగత ఎమ్మెల్యే చౌదరి సత్యనారాయణ నిరాడంబరుడని, నిజాయితీకి నిలువుటద్దం లాంటి వారని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి అన్నారు. చౌదరి సత్యనారాయణ జయంతి సందర్భంగా గురువారం శాంతినగర్ కాలనీలోని గాంధీ స్మారక మందిరంలో ఆయన విగ్రహానికి కుటుంబసభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు తాండ్ర అరుణమ్మ, జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధి కొంక్యాన వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చౌదరి సతీష్, తాండ్ర సునీల్, బగాది కిషోర్, చౌదరి అవినాష్, బొడ్డేపల్లి రవి, జోషి, గౌరీ, బిర్లంగి రామ్మోహన్, నటుకుల మోహన్, జామి భీమశంకర్, బాడాన దేవభూషణరావు, పొన్నాడ రవికుమార్, శాస్త్రి, గుత్తు చిన్నారావు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎంపీపీ గొండు రఘురామ్

గార: జగనన్న ప్రభుత్వం పేదవాడికి అండగా ఉంటోందని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. గురువారం శ్రీకూర్మం మేజర్ పంచాయతీ ఎస్.మత్స్యలేశం సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంజీవ రమణయ్య, బరాటం నాగేశ్వరరావు, సర్పంచ్ జి.అనిత, అంధవరపు బాలకృష్ణమూర్తి, ఊట అప్పలనాయుడు, రాజు పాల్గొన్నారు.

రిమ్స్‌లో అన్నప్రసాద వితరణ

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్ వద్ద సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకంలో భాగంగా గురువారం డాక్టర్ రూప, డాక్టర్ ప్రవీణ శివకుమార్‌లు తమ కుమారుడు రేహాన్స్ పుట్టిన రోజు సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశారు. రోగుల సహాయకులకు అన్న ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ సంఘం కార్యదర్శి కిల్లాన ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా కామేశ్వరీ మాత



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషి మాత ఆలయం వద్ద కామేశ్వరీ మాత దేవాలయంలో ఆషాఢ మాసం సందర్భంగా గురువారం అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

● ఘనంగా ఎమ్మెల్యే కిరణ్ జన్మదిన వేడుకలు

ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ జన్మదిన వేడుకలు గురువారం రణస్థలంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు హాజరై ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. – రణస్థలం



బర్త్‌డే కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



క్రికెట్ టోర్నీ విజేత పైడిభీమవరం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్, సతీమణి పరిమళ